క్లుప్తంగా

ఆదిత్యాలయానికి నిరంతర విద్యుత్



ఎస్ఈకి జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల్లో ఒకటైన అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయానికి ఇకపై విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసేలా అన్ని చర్యలు చేపడతామని ఈపీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తి ప్రకటించారు. సోమవారం ఆయన తొలిసారిగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాలను, తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. అరవసల్లి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో కావాల్సిన విద్యుత్ అవసరాలపై ఈఓతో ఎస్ఈ చర్చించారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ, హరిప్రసాద్ శర్మ, ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు, ఎస్ఏఓ తాతాచార్యులు, ఏఈలు కమల్‌హాసన్, శ్రీనివాసరావు, శ్యామలరావు, విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు



ఎస్పీ రాధికను సత్కరిస్తున్న క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా క్రిస్టియన్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు జి.శ్యామ్యూల్ ఎస్పీతో మాట్లాడుతూ.. జిల్లాలో పలుచోట్ల ప్రార్థనా మందిరాల నిర్మాణాలు చేపట్టేటప్పుడు కొందరు అడ్డుపడుతున్నారని, సువార్తలకు వెళ్తున్నవారికి అనుమతులు కావాలంటూ ఘర్షణ పడుతున్నారని విన్నవించుకున్నారు. అనంతరం ఎస్పీని దుశ్శాలువతో సత్కరించారు. ఫోరం సహాధ్యక్షులు ఒ.రమేష్, ప్రధాన కార్యదర్శి పి.ఎం.రాజు, సభ్యులు అహరోస్, తవుడు, పాస్టర్స్ పి.ప్రసాద్, అశిర్‌కుమార్, చంద్రశేఖర్, కృష్ణారావు, సంసోను, గాబ్రియేల్, యెషయా ఉన్నారు.


విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు జగన్నాథరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే వ్యక్తిగత క్రమశిక్షణ అవసరమని బెంగుళూరుకు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ జగన్నాథరావు అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం కంప్యూటర్ సైన్స్, ఫార్మసీ చివరి ఏడాది విద్యార్థులకు అకమిక్ అండ్ కెరియర్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన ఆయన మాట్లాడుతూ చదవుతున్న రంగంలో విద్యార్థులు పూర్తిస్థాయి నైపుణ్యం సాధించాలన్నారు. ఉద్యోగ, ఉపాధి, సాంకేతిక, పారిశ్రామిక అంశాలపై అవగాహన ఉండాలన్నారు. క్లాస్ వర్క్ విషయంలో నిర్లక్ష్యం వద్దని, కనీసం 90 శాతం హాజరు ఉండాలన్నారు. ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు, డాక్టర్ కేఈవీ నాగోజీ పాల్గొన్నారు.

మోడల్ పద్ధతితో మెరుగైన అదాయం



మోడల్ పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మోడల్ పద్ధతిలో కూరగాయలు పంటలు సాగు చేయడం వల్ల 360 రోజులు ఆదాయం వస్తోందని మాస్టర్ ట్రైనర్ లక్ష్మన్నాయుడు అన్నారు. కుశాలపురంలో కూరగాయల సాగుపై సోమవారం అవగాహన కల్పించారు. కనీసం 20 సెంట్లలో సాగు చేయవచ్చఅన్నారు. నెలకి కనీసం రూ.10వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీదేవి, గున్నంనాయుడు, సత్యవతి, ధనుంజయ్ పాల్గొన్నారు.

సింగుపురంలో గ్రామ సభ రేపు

శ్రీకాకుళం రూరల్: సింగుపురం గ్రామంలో రీ సర్వే డ్రాఫ్ట్ ల్యాండ్‌పై బుధవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి పర్యవేక్షణలో ఉదయం పది గంటలు ప్రారంభం కానున్న గ్రామ సభకు సింగుపురం రైతులు, గ్రామస్తులు హాజరు కావాలని సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

పేదలకు వరం



ఎచ్చెర్ల క్యాంపస్: వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మొదలవలస చిరంజీవి



గార: రోగితో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు



శ్రీకాకుళం రూరల్: రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు



లావేరు: చినకొత్తకోటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

జి.సిగడాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నిశ్చెల కోరారు. మండలంలోని సీతంపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. సర్వేలో పేర్లు నమోదు చేసినవారికి వైద్య పరీక్షలు చేపట్టారు. ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహాన్ని ప్రదర్శించారు. వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, అనుష, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచ్ గేదెల మల్లిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

లావేరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ, ఎంపీడీఓ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని చినకొత్తకోట గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. లావేరు, మురపాక పీహెచ్‌సీల వైద్యులు మణిభూషణ్, జగదీష్‌కుమార్, రిమ్స్ ఆస్పత్రి వైద్యులు 245 మందికి వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. ఐసీడీఎస్‌శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. సర్పంచ్ శాంతాటి భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి మురళి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డి.మత్స్యలేశంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: డి.మత్స్యలేశం గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి ప్రారంభించారు. ఆరోగ్య పరీక్షలు, టెస్టులు నిర్వహించి, అవసరమైనవారికి వైద్య సేవలు, మందులు అందజేయాలన్నారు. వైద్యసిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు, ఏడు రకాల టెస్టులు నిర్వహించారు. సర్పంచ్ మూగి ఈక్షిత, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిషిణిలో..

రణస్థలం: ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రెడ్డి విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని పిషిణి గ్రామ సచివాలయంలో పాతర్లపల్లి పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణచైతన్య ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 281మందికి వైద్య సేవలు అందించారు. 14 మందికి ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. 103 మందికి కంటి పరీక్షలు చేసి, ఇందులో 55 మందికి కళ్లద్దాలు అందజేశారు. 9 మందికి కంటి శస్త్ర చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిఫర్ చేశారు. మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, ఏఓ ధనుంజయరావు, ఎంపీటీసీ పతివాడ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యం

గార: ప్రజల చెంతకే వైద్యం అందించడం కోసం ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. ఎస్.మత్స్యలేశం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించారు. రోగులకు అవసరమైన 63 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతోపాటు మందులు అందజేస్తున్నట్టు చెప్పారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, ఎంపీడీవో సంజీవ రమణయ్య, వైద్యురాలు పద్మావతి ఉన్నారు.

అందరూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి

శ్రీకాకుళం రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు రుప్పదివ్య అన్నారు. బైరి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట్రావు, ఈవోపీఆర్డీ ప్రకాశ్‌రావు, పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్, స్థానిక సర్పంచ్ ముద్దాడ ఇందుమతి, గంగు నరేంద్రకుమార్, నక్క శంకర్, పార్టీ నాయకులు ఎం.డి.అసిరినాయుడు, యజ్జల గురుమూర్తి, ఓటుపల్లి క్రిష్ణ, బోర రమణయ్య ఉన్నారు. కాగా వైద్య శిబిరంలో 364 ఓపీలో నమోదయ్యాయి.



జి.సిగడాం: సీతంపేటలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



జి.సిగడాం: సీతంపేటంలో పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



లావేరు: చినకొత్తకోటలో ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్



రణస్థలం: పిషిణిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ విశ్వేశ్వరరావు

క్రీడలతో మానసిక ఉల్లాసం



విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఐ ఆదాం, అతిథులు

ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడతో విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జీఆర్‌పురం సీఐ ఆదాం అన్నారు. ఎచ్చెర్లలోని కేశవరెడ్డి పాఠశాలలో కేశవరెడ్డి సంస్థల ఆధ్వర్యంలో మూడు రోజుల జోనల్ స్పోర్ట్స్ మీట్- 2023-24ను సోమవారం ప్రారంభించారు. జిల్లాలోని ఎచ్చెర్ల, ఆంపోలు, అరసవల్లి, రాజమండ్రి క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫిట్‌నెస్ కీలకమన్నారు. చదవులో రాణించాలన్నా ఆరోగ్యంగా ఉండాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సైతం కీడలను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు నచ్చిన క్రీడలను ఎంచుకోవాలన్నారు. యోగా, ధ్యానం వంటివి విద్యార్థి దశ నుంచి అలవాటు చేసుకోవాలని వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యానారాయణ, జిల్లా పీఈటీల అసోషియేషన్ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాల సందర్భంగా సోమవారం ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన జూనియర్స్ విభాగంలో ఎ.గాయత్రి, బి.యశ్విని, వి.హంససాయి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ విభాగంలో వి.మురళీకృష్ణ, కె.నరేంద్ర, కె.లిఖిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వక్తృత్వం జూనియర్స్‌లో విశాలాక్షి, రినీషా, షణ్ముఖలక్ష్మీ, సీనియర్స్‌లో సత్యహిందు, వి.రోహిణి, దేవీచరణ్ తొలిమూడు స్థానాల్లో నిలించారు. చిత్రలేఖనం జూనియర్స్‌లో ఎల్.పవన్‌కుమార్, పి.వరుణ్‌తేజ్, ఆర్.వర్షిణి, సీనియర్స్‌లో కె.నీలారాణి, వి.కిరణ్, పి.అఖిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరందరికీ ఈవో వి.హరిసూర్యప్రకాష్ బహుమతులు అందజేసారు. అలాగే శ్రీసుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో కాపువీధికి చెందిన శ్రీసూర్యతేజ కోలాటం సభ్యులు అనివేటి మండపంలో కోలాటం ప్రదర్శించారు. ఆరో రోజున కూడా ఉదయం గోపూజ, సూర్యనమస్కారాలు, వేదపారాయణ తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అధికారులు కృష్ణమాచార్యులు, బిఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ధర్మప్రచార వారోత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి.

ఎస్‌వీసీ సిబ్బంది నిజాయితీ



పర్సును అందజేస్తున్న థియేటర్ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: దొరికిన పర్సును సంబంధిత వ్యక్తికి అందజేసి శ్రీకాకుళంలోని ఎస్‌వీసీ థియేటర్ సిబ్బంది నిజాయితీని చాటుకున్నారు. గుజరాతీపేట టీచర్స్ కాలనీకు చెందిన ఎస్.శ్యామల భర్తతో పాటు అమెరికాలో ఉద్యోగం చేస్తోంది. ఇటీవల సెలవుల నిమిత్తం కన్నవారింటికి శ్రీకాకుళం వచ్చింది. దంపతులిద్దరూ ఎస్‌వీసీ థియేటర్‌కు సినిమా చూసి ఇంటికి వెళ్లిపోయారు. అయితే సినిమా చూస్తున్న సమయంలో తన పర్సు జారవిడుచుకున్న విషయం గుర్తించలేదు. ఇంటికి వచ్చిన తరువాత చూసేసరికి పర్సు కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. ఎక్కడ పడిపోయిందోనని తర్వాత రోజంతా వెతికారు. థియేటర్ వద్దకు వచ్చి పర్సు పోయిన విషయాన్ని మేనేజర్ బి.రవి వద్ద ప్రస్తావించారు. దీంతో తమ సిబ్బందికి ఓ పర్సు దొరికిందని..మీదో, కాదో చూడాలని చెప్పి చూపించారు. ఆ పర్సు తనదేనని చెప్పడంతో శ్యామలకు సోమవారం అందజేశారు. అమెరికాకు సంబంధించిన గుర్తింపు కార్డులన్నీ పర్సులోనే ఉన్నాయని, దొరకకపోతే ఇప్పట్లో అమెరికా వెళ్లే అవకాశం ఉండేది కాదని ఆమె చెప్పారు. పర్సులో యూఎస్ గుర్తింపు కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్‌కార్డు, పాన్‌కార్డులు, కొంతనగదు, గ్రీన్‌కార్డు తదితరవి ఉన్నాయి. పర్సును అందజేసిన థియేటర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అరసవల్లి: ఆమదాలవలస ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రాగోలు గ్రామ పరిధిలో రాగోలు, కొత్తరోడ్డు, అక్కివరం, తోటాడ, రావిపాడు, బావాజీపేట, లంకాం, వాకలవలస, చంద్రయ్యపేట తదితర గ్రామాలకు ఈ నెల 11న విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతమే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎచ్చెర్ల మండల వెలుగు ఏపీఎం ఎ.హరికృష్ణ అన్నారు. ఎచ్చెర్లలోని వెలుగు కార్యాలయంలో సోమవారం రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలో 221 సంఘాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సంఘం నెల వారీ పొదుపు చేయటం, అర్హత మేరకు రుణాలు తీసుకోవటం, వాయిదాలు చెల్లించటం, సాగు చేసిన పంటలు అమ్మకం, మద్దతు ధర పొందటం, రైతు భరోసా కేంద్రాలు సేవలు పొందటం, ప్రభుత్వ పథకాలు పొందటం వంటి అంశాలను వివరించారు. భవిష్యత్‌లో పంటల సాగుపై అవగాహన కల్పించారు.

సుడిదోమపై అప్రమత్తం



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: వరి పంటను నాశనం చేసే సుడిదోమ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. ధర్మవరం పంచాయతీలోని పలు గ్రామాల్లో వరి పంటను సోమవారం పరిశీలించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సి.హెచ్.వెంకటరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నీలవేణి, వై.సూర్యకుమారి, ఎచ్చెర్ల వ్యవసాయ అధికారి వై.సురేష్ క్షేత్రస్థాయిలో వరి సాగును పరిశీలించారు. వరిలో సుడిదోమ పట్ల సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. సుడిదోమ నివారణకు పొలాన్ని ఆరబెట్టటం, నత్రజని ఎరువులు మోతాదుకు మించి వినియోగించకపోవటం, దోమ వ్యాప్తి మేరకు పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. దుబ్బుకి 50 నుంచి 150కి పైబడే దొమలు ఉండే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల సూచనలు తీసుకోవాలన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేస్తున్న తిరుపతిరావు

లావేరు: పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు అన్నారు. మండలంలోని తాళ్లవలసలో సోమవారం పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను పాడిరైతులకు పంపిణీ చేశారు. పాడి రైతుల సంక్షేమం కోసం ప్రతీ సచివాలయానికి సీఎం జగన్‌మోహనరెడ్డి వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించారన్నారు. గ్రామాల్లోనే పశువులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ జి.లక్ష్మీకాంతం, వైఎస్సార్‌సీపీ నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

● వైభవంగా కూర్మనాథుని శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

గార : విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి శోభాయత్ర వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగించారు. లంకపేట జానకిరామ కోలాటం, ఇప్పిలి భజనబృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గోకర్ణపల్లికి చెందిన ఆర్.మీనాక్షి హరికథా గానం అలరించింది. ఈవో జి.గురునాధం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, పాలకమండలి సభ్యులు పూడి కమల, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: పిల్లలు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. సెప్టెంబరు 30వ తేదీన శ్రీకాకుళం నగరంలోని శ్రీఅక్షర స్కూల్‌లో నిర్వహించిన వరల్డ్ పీస్ పోస్టర్ డే కాంటెస్ట్‌లో విజేతలుగా నిలిచిన 60 మంది విద్యార్థులకు సోమవారం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో రవికుమార్ బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జోనల్ చైర్‌పర్సన్ బాడాన దేవభూషణరావు, ట్రెజరర్ శిల్లా మణి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బీజేపీ ఆధ్వర్యంలో 'నామట్టి–నాదేశం'



ర్యాలీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకులు 'నామట్టి–నాదేశం' పేరిట శ్రీకాకుళం నగరంలో సోమవారం సాయంత్రం ర్యాలీ చేపట్టారు. సూర్యమహల్ కూడలిలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి గ్రామాలు, వార్డులు నుంచి తీసుకువచ్చిన కలశాలను పట్టుకొని ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నామట్టి–నాదేశం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. భారతీయుల ఐక్యతను చాటి చెప్పే విధంగా పుణ్యభూమిలోని ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీలో స్మృతి వనం నిర్మించతలపెట్టడం గొప్ప కార్యమని అభివర్ణించారు. ఈనెల 13వ తేదీ వరకు మండలాల వారీగా కలశాలతో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర పదాధికారి పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి, ఎంబీజే నాయుడు, వెంకటేశ్వరరావు, చింతపల్లి దుర్గారావు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన



ధర్నా చేస్తున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా పోస్టుమేన్ యూనియన్ కార్యదర్శి బాబూరావు డిమాండ్ చేశారు. అఖిలభారత తపాలా ఉద్యోగ సంఘాల సమన్వయ కమిటీ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ పిలుపు మేరకు శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ అధికారి వారి కార్యాలయం వద్ద ఉద్యోగులు సోమవారం నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో గ్రూప్–సీ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి గణపతి, గ్రామీణ తపాలా ఉద్యోగుల జిల్లా కార్యదర్శి నందికేశ్వరరావు, సంఘ నాయకులు యు.వి.రమణ, పాత్రో వెంకటేష్, చిన్నారావు, బి.ఎస్.ఆర్.మూర్తినాయుడు, గురన్న ప్రకాశరావు, కోటేశ్వరరావు, తేనేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం సూపరిటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు.

స్పందనలో రెడ్‌క్రాస్ సభ్యుల సేవలు

శ్రీకాకుళం కల్చరల్: జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో రెడ్‌క్రాస్ సభ్యులు సేవలందించారు. నడవలేని, నిరాశ్రయులకు వీల్ చైర్ సేవలు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. స్పందనలో వినతులు అందించేందుకు వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు తమ సభ్యులు విశేష సేవలు అందిస్తున్నారన్నారు.